



# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

ఖమ్మం
భద్రాద్రి
కొత్తగూడెం

శనివారం 21, ఫిబ్రవరి 2026


# ప్రయత్నమే విజయానికి మార్గం

2 లో..

“ పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ”

**ఖమ్మం సూర్య బ్యూరో :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి వచ్చిన 230 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ‘సీఎం కప్-2026‘ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచి మంచి గుర్తింపు తీసుకురావాలనన్నారు. క్రీడల ద్వారా క్రీడా స్ఫూర్తి పెంపొందుతుందని, గెలుపు మాత్రమే లక్ష్యం కాకుండా పాల్గొనడం కూడా ముఖ్యమని తెలిపారు. ఓటమికి భయపడకుండా నిరంతరం ప్రయత్నం చేయాలని అన్నారు.








## బోయి తండాలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు

ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్

4 లో..



## పేద విద్యార్థులు చదువుకునే కళాశాలలో మెరుగైన విద్యా బోధన చేయాలి

- ఎమ్మెల్యే కూనంనేని

2 లో..



## పదోన్నతి ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- జవాబుదారితనంతో పనిచేస్తూ ప్రభుత్వ వ్యవస్థ పై నమ్మకం పెంచాలి
- ఖమ్మం రెవెన్యూ శాఖలో పదోన్నతులు పొందిన 15 మందికి నియామక ప్రతాలను అందజేసిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం, ఫిబ్రవరి సూర్య(మేజర్ న్యూస్) :** విధుల పట్ల నిబద్ధతతో ఉంటూ, ప్రభుత్వ వ్యవస్థ పై నమ్మకాన్ని పెంచుతూ కొత్తగా నియమితులైన ఉద్యోగులు జవాబుదారితనంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.

2 లో..



# బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ చైర్ పర్సన్,వైస్ చైర్మన్

-కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం ప్రతి ఒక్కరికి చేర్చాలి

- ఎమ్మెల్యే జారె ఆదినారాయణ





అశ్వరావు పేటటౌన్,సూర్య(మేజర్న్యూస్)- అశ్వారావుపేట మున్సిపాలిటీ నూతన పాలకవర్గం మున్సిపల్ కార్యాలయంలో అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. చైర్ పర్సన్గా జూపల్లి శశికళమ్మ, వైస్ చైర్మన్గా జూపల్లి రమేష్బాబు అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ముందుగా మున్సిపల్ కార్యాలయంలో పూజా కార్యక్రమం నిర్వహించిన, జూపల్లి దంపతులు వారి వారి స్థానాల్లో కొలువుదీరారు.అనంతరం మున్సిపల్ కమిషనర్ నాగరాజు పర్యవేక్షణలో కౌన్సిలర్లు డేరంగుల ప్రసాద్, దగ్గుమాలి మౌనిక, చిన్నంశెట్టి శ్రీను, కట్టా సింధుజ, కొట్టే నాగసునీత, ఎస్.కె రెహానా, ఎస్.కె నూర్జహాన, మిండా హరిబాబు,



నార్లపాటి దివాకర్, నార్లపాటి మహేష్, తిరుమలశెట్టి వెంకన్నబాబు, అట్టం రమ్య, మోర్ల రాజేశ్వరి, కారం కనకదుర్గ, దండాబత్తుల ఆదిలక్ష్మి, బాధ్యతలు స్వీకరించారు. మండల వ్యాప్తంగా అనుచరులు అభిమానులు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పాల్గొని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన బాధ్యత ఎంతో ఉన్నతమైందని ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం పట్టణ అభివృద్ధికి కట్టుబడి పని చేయడం ప్రతి ప్రజాప్రతినిధి కర్తవ్యం అని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ పట్టణంలో పారిశుద్ధ్యం తాగునీరు రహదారులు వీధి దీపాలు పేద మధ్యతరగతి కుటుంబాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా పారదర్శకంగా బాధ్యతాయుతంగా సేవ చేయాలని తెలియజేశారు.

# సిపిఐలో చేరిన సర్పంచ్ సరస్వతి

-కండువా కప్పి ఆహ్వానించిన కూనంనేని



పాల్వంచ,సూర్య (మేజర్న్యూస్)-మండల పరిధిలోని నారాయణరావుపేట ఎస్సీ కాలనీ సర్పంచ్ బండా సరస్వతి సిపిఐ పార్టీలో చేరారు. ఆమెకు ఎంఎల్ కూనంనేని సాంబశివరావు శుక్రవారం ఎర్రకండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఇండిపెంటెంట్ అభ్యర్ధిగా ఇటీవల గ్రామపంచాయితీ ఎన్నికల్లో 178 ఓట్ల మెజార్టీతో సర్పంచ్గా గెలిచిన సరస్వతి ఎంఎల్ కూనంనేని సాంబశివరావు సారధ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితురాలై సిపిఐ చేరినట్లు తెలిపారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న గ్రామ పంచాయితీ సమగ్రాభివృద్ధి సాధించాలంటే అది సిపిఐతోనే సాధ్యమని ఆమె అన్నారు. అనంతరం ఎంఎల్ఏ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలో చేరిన సర్పంచ్ సరస్వతి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటు పడాలని, పంచాయితీలో ఉన్న ప్రతీ సమస్యను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేయాలని, ప్రజలతో మమేకమై ముందుకు సాగాలని సూచించారు. పాల్వంచ మండల సిపిఐ అనుబంధ రైతు సంఘం అధ్యక్షులు కొంగర అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికలో సిపిఐ నాయకులు వాసిరెడ్డి మురళీ, చలిగంటి శ్రీనివాస్, బొర్రా కేశవులు, రాంబాబుతో పాటు తదితరులున్నారు.

# యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్యం మెరుగుపరచండి

## -16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ

## -అపరిష్కృత ప్రాంతాలను అధికారులతో సందర్శించిన కార్పొరేటర్

కొత్తగూడెం,సూర్య (మేజర్ న్యూస్)- కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 16 వ డివిజన్లో అపరిష్కృతంగా పేరుకపోయినా పారిశుధ్యన్నీ మెరుగుపరచాలని, డివిజన్లోని కోతులు, కుక్కల సమస్యను పరిష్కరించాలని 16 వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.శుక్రవారం 16వ డివిజన్లో అధికారులతో పర్యటించి మాట్లాడుతూ దోమల నివారణకు దోమల పొగ ,బ్లీచింగ్ పౌడర్ చల్లాలని కార్పొరేషన్ ఎస్సై, మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ శానిటేషన్ ఎస్సై మినహాజ అధికారులతో వార్డులోని నెహ్రూ బస్తి, లక్ష్మీ టాకీస్ ఏరియా, నాగయ్య గడ్డ, నేతాజీ బస్తి, బర్మా క్యాంప్, రాజీవ్ గాంధీ కాలనీలను సందర్శించారు. వీరితో పాటుగా పారిశుధ్య అధికారి వీరభద్ర చారి, శానిటరీ జవాన్ ప్రభుదాస్, డివిజన్ ప్రజలు కాంపల్లి దుర్గయ్య ,డి సత్యనారాయణ, టాటా మ్యాజిక్ సలీం,జి వెంకన్న ,సంపత్, యు శ్రీను తదితరులు పాల్గొన్నారు.




# జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని సందర్శించిన ఐటీడీఏ పీఓ రాహుల్



కొత్తగూడెం,సూర్య (మేజర్న్యూస్)- జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ శుక్రవారం సందర్శించారు.ఈ సందర్భంగా గ్రంథాలయ పరిసరాలు, పుస్తకాలు, అందుబాటులో ఉన్న వనరులు, పని వేళలు, సిబ్బంది పనితీరును పూర్తిగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఇంత మంచి గ్రంథాలయం మనకు అందుబాటులో ఉండటం అదృష్టకరమని, విద్యార్థుల భవిష్యత్తుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కష్టపడి చదివే వారికి ఇది ఒక ఆదర్శ నిలయమని, ఇప్పటికే ఈ గ్రంథాలయం ద్వారా ప్రేరణ పొంది పలువురు ఉద్యోగాలు సాధించినట్లు ఫోటో ఎగ్జిబిషన్ ద్వారా తెలుస్తోందన్నారు.నోటిఫికేషన్లకు సిద్ధం రాబోయే ఉద్యోగ నోటిఫికేషన్లను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు కష్టపడి చదివి తమకంటూ ఒక ఉద్యోగాన్ని సంపాదించుకోవాలని సూచించారు. నిరుపేద కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులకు ఈ గ్రంథాలయం మార్గదర్శకంగా నిలుస్తుందని తెలిపారు.నోటిఫికేషన్లు వచ్చిన వెంటనే తన వంతు బాధ్యతగా అవసరమైన పుస్తకాలను అందజేస్తానని, కోచింగ్ సెంటర్లో ఉచిత శిక్షణ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కష్టపడే విద్యార్థులకు తాను వెన్నంటి ఉంటానని, అన్ని విధాల ప్రోత్సహిస్తానని పేర్కొన్నారు. గ్రంథాలయ చైర్మన్ వీరబాబు,సిబ్బంది విద్యార్థులకు ప్రోత్సాహకరంగా అన్ని విధాలుగా తోడుగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, ఆఫీస్ ఇంచార్జ్ ఎం నవీన్ కుమార్, గ్రంథ పాలకురాలు జీ.మణి మృదుల, మధు బాబు, పాఠకులు పోటీ పరీక్షలకు సిద్ధపడుతున్న విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బోయి తండాలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు


-ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్



ఇల్లందు ఆర్సి,సూర్య (మేజర్న్యూస్)-ఇల్లందు మండలం బోయితండాలో శుక్రవారం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తండా వాసులు సంప్రదాయ పద్ధతిలో హారతి ఇచ్చి, సంప్రదాయ నృత్యాలతో ఆయనకు స్వాగతం పలికారు.కలెక్టర్ చేతుల మీదుగా భోగ్ కార్యక్రమం నిర్వహించబడగా, అనంతరం అన్నదానం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహారాజ్ జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకుని సమాజం అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. యువత చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. యువత భవిష్యత్తు అభివృద్ధి కోసం జిల్లా పరిపాలన వంతు సహకారం అందిస్తుందని పేర్కొన్నారు.మారుమూల ప్రాంతమైన ఈ తండాలో విద్యావంతులు ఎదగడం ప్రశంసనీయమని, ఉన్నత విద్య సాధించిన వారిని చూసి ఇతరులు స్ఫూర్తి పొందాలని సూచించారు.తమ తండాకు జిల్లా కలెక్టర్ పర్యటనపై తండా వాసులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డా. బన్సీ, డా. సునీంద్ర, డా. రామ్ నివాస్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



# సదరం క్యాంపును పరిశీలించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన





కొత్తగూడెం కలెక్టరేట్, సూర్య(మేజర్ న్యూస్)- కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నిర్వహిస్తున్న దివ్యాంగుల వైకల్యం నిర్ధారణ సదరం క్యాంపును శుక్రవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన పరిశీలించారు. ఈ సందర్భంగా క్యాంపులో నిర్వహిస్తున్న దివ్యాంగుల వైద్య పరీక్షలు, ఆన్‌లైన్ దరఖాస్తుల నమోదు విధానాన్ని ఆమె ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు, సేవల లభ్యత, వైకల్యం నిర్ధారణకు వినియోగిస్తున్న పరికరాల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని, ప్రతి దివ్యాంగుడికి అవసరమైన గుర్తింపు, సర్టిఫికేషన్ అందేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న యూనిక్ డిసెబిలిటీ ఐడెంటిటీ (యుడిఐడి) కార్డులు తెలంగాణ రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందుతాయని తెలిపారు. ఈ కార్డుల ద్వారా దివ్యాంగులు ఆరోగ్య, విద్య, ఉపాధి, రవాణా తదితర రంగాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను సులభంగా పొందగలరని తెలిపారు. ప్రతి దివ్యాంగుడు సమాజంలో సమాన హక్కులు, అవకాశాలు పొందేలా ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా యూడీఐడీ కార్డుల కోసం దరఖాస్తు చేసిన దివ్యాంగులకు ఆసుపత్రిలో వైకల్యం నిర్ధారణ కోసం సదరం స్లాట్ బుకింగ్ చేయాలని, ముందస్తుగా దరఖాస్తుదారులకు సమాచారం అందించి సమయానికి పరీక్షలు జరిగేలా చూడాలని సూచించారు. వైద్య పరీక్షల సమయంలో అవసరమైన వైద్య నిపుణులు, పరీక్షా పరికరాలు, సాంకేతిక సిబ్బంది పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సదరం క్యాంపు ప్రాంతంలో దివ్యాంగులు ఇబ్బంది పడకుండా అన్ని సౌకర్యాలు, వీల్‌చెయిర్లు వంటి ప్రాథమిక వసతులు కల్పించాలని సూచించారు. దివ్యాంగులకు అనుకూలమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావించాలన్నారు. పరీక్షల అనంతరం ప్రతి దివ్యాంగుడి వైకల్యం శాతం, వ్యక్తిగత వివరాలు, వైద్య నిపుణుల సర్టిఫికేషన్ వివరాలను సమగ్రంగా యూడీఐడీ పోర్టల్‌లో నమోదు చేసి, ఎటువంటి లోపాలు లేకుండా డేటా ఎంట్రీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దివ్యాంగుల సమాచారం డిజిటల్ రూపంలో భద్రపరచడం వల్ల భవిష్యత్తులో వివిధ పథకాల అమలుకు ఇది బలమైన ఆధారంగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ పరిశీలనలో వైద్య నిపుణులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డివిజన్ అభివృద్ధి,ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతాం

**-55వ డివిజన్లో ఇంటింటికి కార్పొరేటర్ ములాకత్ కార్యక్రమం**

**- మాజీ సీనియర్ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్ హరిహరన్**





కొత్తగూడెం, సూర్య(మేజర్‌న్యూస్)- కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 55 డివిజన్లో కూలి లైన్, సాయి నగర్‌లో ఇంటింటికి కార్పొరేటర్ ములాకత్ కార్యక్రమాన్ని గత మూడు రోజుల నుండి కార్పొరేటర్ హరిహరన్, మాజీ కౌన్సిలర్ వై. శ్రీనివాస్ రెడ్డిల సారధ్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ఓట్లు వేసిన ప్రతి ఒక్కరికి అభినందనలు కృతజ్ఞతలు తెలుపుతూ వారికి ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని డైరీలలో రాసుకుంటున్నారు. డివిజన్ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం డివిజన్లో డివిజన్ కార్యాలయం ఏర్పాటుకు సన్నహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నూతన కార్పొరేటర్ గాఎన్నికైన సింగర హరి హరన్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని, ప్రజా ప్రభుత్వాన్ని ఆదరించి గెలిపించి అద్భుత విజయాన్ని అందించిన 55వ డివిజన్ ప్రజలకు.. పేరు పేరునా అభినందనలు కృతజ్ఞతలు తెలియజేశారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రామ సహాయం రఘురామిరెడ్డి, స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, స్థానిక కాంగ్రెస్ రాష్ట్ర జిల్లా నాయకుల సారధ్యంలో డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ప్రధానంగా ప్రజలను గాయపరుస్తూ ఇబ్బంది పెడుతున్న కోతులు, కుక్కల పట్టివేతకు గౌరవ జిల్లా కలెక్టర్, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్, కమీషనర్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి గట్టిగా కృషి చేస్తామని, సమస్యల పరిష్కారానికి దశలవారీగా పనిచేస్తూ ప్రజల ఆదరాభిమానాలు పొందటం జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా గెలిచిన వెంటనే తిరిగి వెనువెంటనే డివిజన్లో ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ఇంటింటికి కార్పోరేటర్ ములాకత్ కార్యక్రమం నిర్వహిస్తున్న మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి, కార్పోరేటర్ హరిహరన్‌ను వార్డు పెద్దలు, మహిళలు, ప్రజలు అభినందించారు.

## పలువిద్యుత్ సబ్ స్టేషన్ ల పరిధిలో విద్యుత్ కు అంతరాయం.



టేకులపల్లి సూర్య (మేజర్ న్యూస్)- నేడు ముత్యాలంపాడు ఎక్స్ రోడ్ వద్ద నూతన సబ్‌స్టేషన్‌కు సంబంధించిన అత్యవసర 33 కెవి విద్యుత్ లైన్ విస్తరణ పనులు నిమిత్తం ,పలు విద్యుత్ సబ్ స్టేషన్ ల పరిధిలో విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని బొమ్మనపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ ఏ ఈ. పిండి పోలు. బుజ్జి కన్నయ్య శుక్రవారం తెలిపారు. ఈ పనుల నిమిత్తం కోయగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు ,తాత్కాలికంగా విద్యుత్ సరఫరా, బొమ్మనపల్లి సబ్ స్టేషన్ కి సంబంధించిన 33 కెవి ఇంటర్ లింక్ లైన్స్ పనుల నిమిత్తం, విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. సంబంధిత ప్రాంతంలోని వినియోగదారులు, రైతులు ఈ విషయాన్ని గమనించి, విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

## వెంకట్ గౌడ్ పై ఆరోపణలు అవాస్తవం

**-మాదిగ జేఏసీ జిల్లా కార్యదర్శి ముత్యాల శ్రీనివాస్**



ఇల్లందు ఆర్ సి, సూర్య(మేజర్ న్యూస్)- ఇల్లందు మున్సిపల్ మాజీ వైస్ ప్రెసిడెంట్, బీసీ సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మడత వెంకట్ గౌడ్ పై కొందరు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని, దురుద్దేశ పూర్వకంగా చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని మాదిగ జేఏసీ జిల్లా కార్యదర్శి ముత్యాల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం నాడు 22 వార్డులో జరిగిన ఒక సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత బిడ్డల సమస్యల సాధన కోసం ఎప్పుడు పరితపిస్తారని, బీసీ ఎస్టీ, ఎస్సీ మైనార్టీల క్షేమం కోసం పనిచేస్తుంటారని అన్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో తాను తిరిగిన అన్ని వార్డులు గెలిచాయని, అలాంటి నాయకుని పై లేని పోనీ ఆరోపణలు చేస్తూ కొందరు పబ్బం ఈ గడుపుకుంటున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో 22వ వార్డుకు చెందిన దళిత నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## టీపీసీసీ జనరల్ సెక్రటరీని సన్మానించిన 42వ డివిజన్ కార్పొరేటర్

కొత్తగూడెం,సూర్య (మేజర్ న్యూస్)- కొత్తగూడెం కార్పొరేషన్‌లో 42వ డివిజన్ నుండి ఇండిపెండెంట్‌గా గెలిచి మంత్రి పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన కార్పొరేటర్ దున్నపోతుల మణి రవికుమార్ టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములును శుక్రవారం సన్మానించారు. విద్యానగర్‌లోని రెవిన్యూ మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయం జరిగిన ఈ కార్యక్రమంలో పాల్వంచ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

## – 20 మంది విద్యార్డులు ఎంపిక.





**సత్తుపల్లి మేజర్ సూర్య న్యూస్:**
మండల పరిదిలోని గంగారం గ్రామంలోని సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో హైదరాబాద్ కు చెందిన అండ్రీ ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వారు శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్ ఇంజనీర్ పోస్టులకు 20మంది విద్యార్డులు ఎంపికైనట్లు కళాశాల సెక్రటరియేట్, కరస్పాండెంట్ దాసరి.ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 126 మంది విద్యార్డులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా రాత పరీక్ష, టెక్నికల్, హెచ్ఆర్ రౌండ్ల ద్వారా ఎంపిక జరిగిందని ఈ పరీక్షల్లో సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి సిఎస్ఈ, సీఎస్ అండ్ మెషిన్ లెర్నింగ్, ఏఐ అండ్ డేటా సైన్స్, ఈసీఈ విభాగాలకు చెందిన మొత్తం 20 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని, ఎంపికైన వారికి హైదరాబాద్‌లో ఉద్యోగ ఉంటుందని, సంవత్సరానికి రూ.3 లక్షల ప్యాకేజ్ అందుతుందన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, విద్యాధికులు, హెటిరో ఫార్మాస్యూటికల్ కంపెనీ అధినేత, రాజ్యసభ సభ్యులు,సాయిస్ఫూర్తి ఇంజనీ రింగ్ కళాశాల చైర్మన్ డా. బండి.పార్ధసారథిరెడ్డి , విపాసన ఎడ్యు కేషనల్ ట్రస్టీ శ్రీమతి బండి .అన్విదలు వర్చువల్ గా విద్యార్థినీ, విద్యార్ధినీలకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సి పల్ డా.వూటుకూరి శేషారత్నకుమారి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్.యాకూబ్ , కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్ మెంట్ ఆఫీసర్ డా.డియన్ వి కృష్ణారెడ్డి,అన్నీఇంజనీరింగ్ బ్రాంచీల విభాగాధిపతులు పాల్గొన్నారు.

# కమనీయమైన శివపార్వతుల కళ్యాణం..

-కళ్యాణంలో పాల్గొన్న పోలిశెట్టి బిందు గిరి దంపతులు..
-క్షేత్ర శివాలయంలోముగిసిన శ్రీ శివలింగ ప్రతిష్టాపన మహోత్సవం..
-శివనామస్మరణశితొ మారు మ్రోగిన ఆలయ ప్రాంతం..
-కళ్యాణం అనంతరం మహా అన్నదాన కార్యక్రమం..







కొణిజర్ల సూర్య (మేజర్ న్యూస్).. పరమశివుని అనుగ్రహంతో శివ కృప కటాక్షాలు కోసం నిర్మించిన పవిత్ర శివాలయంలో ఉదయం 11 గంటల 33 నిమిషాలకు శ్రీ శివలింగ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు.క్షేత్ర శివాలయం ఆవరణంలో శివపార్వతుల విగ్రహ ప్రతిష్ట నిర్మాణం కోసం గత మూడు రోజుల నుండి క్షేత్ర ఆవరణలో వేద పండితుల ద్వారా ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మొదటిరోజు సంకల్పం ,మహస్త్ర అర పూజలు,స్థల పూజలు నిర్వహించి లింగమం తున్ని ప్రతిష్టపన చేసే ముందు శివపార్వతులకు బలం చేకూర్చేందుకు వేద పండితులైన అయినవిల్లి నాగ వెంకట ఫణి శర్మ (శివ బావ), లక్ష్మీ అచ్యుత సుజయ్ శర్మ (శివ బావ), వెలవలపల్లి నాగేంద్ర కిషోర్ శర్మ పురోహితులతో సంకల్ప,యజ్ఞ పూజలు,రుద్ర పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి పాల్గొన్న వివిధ గ్రామాల తో పాటు జిల్లా వ్యాప్తంగా కూడా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.యాగశాల ఆవరణలో వేదమంత్రాలతో పాటు వేదాలు,ప్రవచనాలు వివరించి ఋగ్వేదము,సామవేదము, ఆథరణ,యజుర్వేదం ద్వారాలు ఏర్పాటు చేసి పలు రకాల పూజలను నిర్వహించారు. శివపార్వతుల కళ్యాణం ప్రారంభానికి ముందు పీటల మీద కూర్చున్న భక్తులు పోలిశెట్టి బిందు గిరి దంపతులు ఇంటి వద్ద నుండి శివపార్వతుల అమ్మవారి విగ్రహాలను రథంపై కూర్చొని పెట్టి మేల్ల తాళాల మధ్య డిజె సౌండ్ సంబురాలతో రథాన్ని భక్తుల చేత లాగుతూ ఊరేగింపు చేశారు. మూడు కలశాల బలాలతో ప్రతిష్టించిన శ్రీ శివలింగ విగ్ర ప్రతిష్ట కార్యక్రమాన్ని ముందుగా గోమాతతో దర్శనంచేసిన అనంతరం భక్తులకు దర్శనమిచ్చారు.అనంతరం కమనీయమైన శివపార్వతుల కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.విగ్నేష్ ని పూజతో ప్రారంభమై, ఆ స్వాములకు బ్రహ్మ ముడి వేయించి వస్త్ర అభినయం చేస్తూ వడిగ జంజాలు మార్పించి వక్షోక్షత్ర నామంతో జీలకర్ర బెల్లాన్ని పెట్టించారు అనంతరం నేల తాళాలు మధ్య శివ పార్వతులకు కళ్యాణాన్ని నిర్వహించారు. కమనీ యమైన శివపార్తుల కళ్యాణాన్నికి వేలాది భక్తులు పాల్గొని తిలకించారు. కల్యాణం అనంతరం పాల్గొన్న వేలాదిమంది భక్తులకు మా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహి ంచారు. కళ్యాణానికి పాల్గొన్న భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగ కుండా మౌలిక వసతులను ఏర్పాటు చేసారు.కళ్యాణ కార్యక్రానికి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఇంతటి మహోత్సవమైన కార్యక్ర మం మండలంలో కాకుండా జిల్లా వ్యాప్తంగా కూడా చూడలేదని అతిపెద్ద శివలింగాన్ని ప్రప్రదముగా క్షేత్ర శివాలయం వద్దనే చూసి తరించి పోయినట్లు ప్రతి ఒక్కరూ అనుకున్నారు.క్షేత్ర శివాలయశీ లో ప్రతిష్టించే శివలింగ మహోత్సవ కార్యక్రమానికి పాల్గొన్న భాకుతులు శివనామస్మ రణతో జపిస్తూ ఆ ప్రాంతం మొత్తం కూడా మారు మ్రోగిపోయింది.

# ఘనంగా శ్రీ సీతారామచంద్ర స్వామి 13వ వార్షికోత్సవం..



**కొణిజర్ల సూర్య (మేజర్ న్యూస్)**
మండల పరిధిలోని అనంతరం గ్రామంలో నిర్మించిన శ్రీ సీతారామచంద్రస్వామి 13 వ వార్షికోత్సవం కార్యక్రమాన్ని భక్తులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.వార్షికోత్సవం పురస్కరించుకొని అనంతారం గ్రామానికి చెందిన వినుకొండ పెద్ద తిరుమల దంపతులు వితరణగా ఇచ్చిన ఆంజనేయ స్వామి విగ్రహాన్ని సీత రామచంద్ర స్వామి ఆలయంలో ఉదయం11:30 నిమిషాలకు ప్రతిష్టాపన చేశారు.వేద పండితులు అనిపెద్ది యశ్వంత్ శర్మ ఆద్వర్యంలో నిర్వహించిన ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమశీలో శాంతి పూజలు నిర్వహించారు. యాగ్నిక బ్రహ్మాస్మార్త పురోహితులు శతాధిక ప్రతిష్ట చర్య దేవాలయ ధర్మాదాయ శాఖ పరిరక్షణ అధికారి అనిపెద్ది నరేష్ శర్మ బ్రహ్మోత్సవములు అత్యంత వైభవ పేతముగా ప్రతిష్ట కార్యక్రమాన్ని, శాంతి కళ్యానాన్ని నిర్వహించారు. భక్తులతో ఆలయం మొత్తం కిక్కిరిచిపోయి. విగ్ర ప్రతిష్ట కార్యక్రమం అనంతరం పాల్గొన్న భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పురోహితులు జయంతి వంశీకృష్ణ శర్మ అప్పల కామేష్ శర్మ సాయి అనురుద్ధిన్ శర్మ తేరాల సాయి మహేష్ శర్మలు పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు.

# వేమన శతకంతో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సత్తుపల్లి ప్రతిభ

## – విద్యార్డులను అభినందించిన ఎమ్మెల్యే రాగమయి, మున్సిపల్ చైర్మన్ రెహానా కమల్ పాషా.



**సత్తుపల్లి మేజర్ సూర్య న్యూస్:**
పట్టణంలోని లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్లో అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆశా స్వచ్చంద సేవా సంస్థ సహకారంతో సత్తుపల్లి టాలెంట్ స్కూల్ విద్యార్థులు రెండు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. 250 మంది ఈఎం విద్యార్థులు వేమన శతక పద్యగళార్చన చేయగా, రెండో తరగతి విద్యార్థులు వేమన శతకం-- అష్టావధానం ప్రదర్శించారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమం సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్,సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ మహ్మద్ రెహానా కమల్ పాషా, సత్తుపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ బొంతు సుమలత,ఎంఈఓ,సత్తుపల్లి పట్టణం కాంగ్రెస్ నాయుకులు, కార్యకర్తలు, టాలెంట్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

## – గురువులకు ఘన సత్కారం







**ఖమ్మం సూర్య టౌన్ న్యూస్**
ఖమ్మం నగరంలోని ఎస్ ఎస్ ఆర్ జె సి ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల 1993 -96 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం శుక్రవారం ఖమ్మం నగర సమీపంలోని సువర్ణపురం గ్రామం వద్ద ఉన్న సూర్య ఆగ్రో ఫార్మ్స్ లో ఘనంగా జరిగింది. వివిధ హోదాలలో ఉన్న పూర్వ విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొని గురువులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల నాటి చదువుకున్న రోజులు, అనంతరం సమాజంలో ఎదిగిన తీరును గుర్తు చేసుకున్నారు. ఆటలు ఆడి పాటలు పాడి ఆనందంగా గడిపారు. సీనియర్ కామర్స్ లెక్చరర్ ఆంజనేయులు దంపతులను వారి ఇంటి వద్ద కలిసి శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ వేడుకలో పూర్వ విద్యార్థులుగా వివిధ హోదాలలో స్థిరపడిన చార్టెడ్ అకౌంటెంట్లు త్రినాథ్, సుధీర్, రమేష్, పాణి, సీనియర్ జర్నలిస్ట్ మైస పాపారావు, హరి కాశ్యప్, శ్రీ పాల్, రంగా, హమీద్, ఎన్నారై ప్రశాంతి, ఎలక్ట్రికల్ జే ఏ ఓ రజిని, రాధిక, పావని, మాధురి, చంద్రకళ, భారతి తదితరులు పాల్గొన్నారు.

# లింగాల గ్రామంలో ఇందిరమ్మ గృహ ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్యే



### -రాగమయి దయానంద్, ఏ యం సీ మహిళా చైర్మన్ బాగం నీరజ ప్రభాకర్ చౌదరి

**కల్లూరు సూర్య న్యూస్ ఫిబ్రవరి 20**

మండల పరిధి లింగాల గ్రామానికి చెందిన మునిగంటి లీలావతి శ్రీను ఇందిరమ్మ నూతన గృహ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా సత్తుపల్లి మహిళా శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్, కల్లూరు ఏ యం సీ మహిళా చైర్మన్ బాగం నీరజ ప్రభాకర్ చౌదరి హాజరై ఇందిరమ్మ గృహం నూతనంగా నిర్మించిన గృహాన్ని వారు ప్రారంభోత్సవం చేశారు అనంతరం వారు లీలావతి శ్రీను వారు నిర్మించుకున్న నూతన గృహంలో అల్పాహారాన్ని ఆరగించారు అందులో భాగంగా పెద్దకొరుకొండి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాదిరాజు అన్నమరాజు తండ్రి మాదిరాజు జగన్నాథరాజు మృతి చెందిన విషయం తెలుసుకున్న వారు పెద్దకొరుకొండి అన్నమరాజు వారి నివాస గృహానికి వెళ్లి జగన్నాథరాజు పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జగన్నాథరావు మృతి బాధాకరమని ఆయన గ్రామానికి ఎన్నో విశిష్ట సేవలు అందించారని వారు తెలిపారు. అనంతరం రాజు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసి వారికి మనో ధైర్యాన్ని కలుగజేశారు ఈ కార్యక్రమంలో కల్లూరు ఏ యం సీ మహిళా చైర్మన్ బాగం నీరజ ప్రభాకర్ చౌదరి పుర చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు పసుమర్తి చంద్రరావు అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఆళ్లకుంట నరసింహారావు లక్కినేని కృష్ణ జిల్లెళ్ళ కృష్ణారెడ్డి పెద్దబోయిన శ్రీను శివకుమార్ నాయక్ పుర కౌన్సిలర్లు మాధవ్ జిల్లెళ్ళ స్వాతి భాస్కర్ రెడ్డి ఉబ్బన రాంబాబు కిష్టంశెట్టి ఏడుకొండలు ఉస్మాన్ ఉబ్బన ప్రభాకర్ రావు యాస నాగమణి శ్రీకాంత్ ఖమ్మంపాటి రాధా వీరస్వామి లింగాల గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవరపల్లి మంగపతి ఏపూరి సాంబశివరావు తక్కిళ్ళపాటి దుర్గాప్రసాద్ మద్ధినేని లోకేష్ పోట్రు అర్జునరావు పిచ్చిరెడ్డి మద్ధినేని గోపాలరావు మునిగంటి బాబు బీరవల్లి దిద్యాలు మేకల సురేష్ మేకల దేవదాసు కాంతారావు శ్యాం వేము నరసింహారావు బాడిస కృష్ణయ్య సోమయ్య సురేష్ పెంటయ్య మానుకొండ చంద్రం మునిగంటి నరసింహారావు కాటేపల్లి కిరణ్ నోటి కృష్ణారెడ్డి ఉబ్బన కరుణాకర్ రావు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పారిదార్శికంగా పరిపాలన అందించండి..ఎంపీడీవో వర్ష



**కొణిజర్ల సూర్య (మేజర్ న్యూస్)**

ఎన్నికల్లో ఓటమి గెలుపు అనేది సహజమేననీ సర్పంచ్ గా ఎన్నికైన మీరు గ్రామ ప్రజలందరిని ఒకే కుటుంబ సభ్యులుగా భావించి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను పారదర్శకంగా అర్హులైన నిరుపేదలకు అందించాలని మండల అభివృద్ధి అధికారి వర్ష అన్నారు. గత రెండు నెలల క్రితం నూతనంగా ఎన్నిక కాబడిన సర్పంచులకు మండల పరిషత్ కార్యాలయ మీటింగ్ హాల్లో శుక్రవారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు.సమావేశానికి ముఖ్య అధికారులు, పంచాయితీ కార్యదర్శులు,సర్పంచ్ హాజరైనారు.ఏర్పాటు చేసిన పరిచయ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో వర్ష హాజరై ముందుగా నూతన సర్పంచులకు అభినందనలు తెలిపి ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు.అనంతరం ఎంపీడీఓ వర్ష మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం,రాష్ట్ర ప్రభుత్వం ద్వారా గ్రామాల అభివృద్ధి కోసం వచ్చే నిధులను సక్రమంగా వినియోగించాలని గ్రామాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి వాటిపై పర్యవేక్షణ చేయాలని ఆమె తెలిపారు. రాబోయేది వేసవికాలం కనుక గ్రామాలలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని, ప్రధానంగా ప్రజలకు అవసరమైన పనిపై దృష్టి సారించి అందరి ఆమోదంతో త్వరతగతిగా పూర్తి చేసి ప్రజల యొక్క మన్నెలను పొందాలని ఆమె కోరారు.ఈపరిచయ వేదికలో నీటిపారుదల శాఖ డి ఈ శిల్ప,ఎంపీ ఓ రాంరెడ్డి ఊపేందరయ్య, పంచాయతీరాజ్ శాఖ ఏఈ కిషోర్ కుమార్, హౌసింగ్ ఏఈ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

# విద్యుత్ షాట్ సర్క్యూట్ తో దగ్ధం అయిన షేక్ నాగులు మీరా కుటుంబానికి పరామర్శ



**ఖమ్మం సూర్య (మేజర్ న్యూస్):**

గణేషునిపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని ఎల్.ఎస్ బంజర్ నందు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల దగ్ధం అయిన షేక్. నాగులమీరా ఇంటిని గ్రామ పెద్దలు చింతనిప్పు నరసింహారావు తో కలిసి సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చి రూ.5000/- రూపాయలు ఆర్థిక సహాయం అందించిన గ్రామ సర్పంచ్ శ్రీమతి పులపాకు మంగ తిరుపతి రావు కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి భాస్కర్ ,గ్రామస్తులు ఉన్నారు.

# ఈనెల 26 నుండి శ్రీ రామలింగేశ్వర స్వామి ఉత్సవాలు!

**కామేపల్లి సూర్య మేజర్ న్యూస్**

కామేపల్లి మండలం కొమ్మినేపల్లి గ్రామపంచాయతీ కొండాయిగూడెం రెవిన్యూ పరిధిలో వేంచేసియున్న శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఉత్సవాలు ఈనెల 26వ తేదీ నుండి ఒకటో తారీకు వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఆహ్వాన పత్రికను ఈరోజు విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కాకతీయుల కాలం నాటి ఎంతో ప్రాచుర్యం పొందిన ఈ శివాలయంలో ప్రతి ఏటా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు అని మాజీ జెడ్పిటిసి మేకల మల్లిబాబు యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ కులమత భేదాలకు తగులేకుండా ప్రతి సంవత్సరంలాగా ఈ సంవత్సరం ఎంత ఉత్సాహంతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. 26 /2/26 గురువారంరోజు న స్వామివారిని పెళ్లి కుమారుని చేయుట. 27/ 2/26 శుక్రవారంరోజున రాత్రి 12 గంటలకు స్వామి వారి కళ్యాణం.28/2/ శనివారంరోజు న స్వామి వారి ఊరేగింపు.1/3/26 ఆదివారం రోజున పూర్ణాహుతి



కార్యక్రమం కలదు కావున కొమినేపల్లి కొండాయిగూడెం పండితాపురం చుట్టుపక్కల గ్రామ ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించగలరని కోరనైనది. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ యం మల్లికార్జున్ రావు.గ్రామ పెద్దలు మద్దినేని రమేష్ చౌదరి. కొమ్మినేని శ్రీనివాసరావు. దొడ్ల వేణు. జన్నారపు లింగయ్య. పాటిబండ్ల ప్రసాద్.తోటకూరి భద్రయ్య. సేలం పుల్లయ్య . చల్లా వీరన్న దిండిగాల శబరి నాథ్.వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.


# ఓ కార్పొరేట్ కాలేజీలో దారుణం

### -డ్రగ్స్ మత్తులో తన్నుకున్న విద్యార్థులు



**ఖమ్మం సూర్య మేజర్ న్యూస్:**

క్రమశిక్షణకు మారు పేరుగా నిలవాల్సిన ప్రయివేట్ కార్పొరేట్ కాలేజీలు నేడు అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాలుగా మారాయి,అక్కడ చదువుతున్న విద్యార్థులు గంజాయి, హెరాయిన్ లాంటి మత్తు పదార్థాలకు అలవాటుపడి తోటి విద్యార్థులపై విచక్షణా రహితంగా దాడులకు పాల్పడుతున్నారు,తల్లి దండ్రుల పెంపకం లోపమో లేక విద్యార్థులపట్ల అధ్యాపకుల నిర్లక్షవైఖరో తెలియదు కానీ విద్యార్థుల్లో రోజు రోజుకి క్రూర స్వభావం పెచ్చుమీరుతుంది,లక్షల్లో ఫీజులు కట్టి తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలనుకుంటే కార్పొరేట్ కాలేజీలు మాత్రం ర్యాంకుల వేటలో విద్యార్థులపై మానసిక ఒత్తిడి పెంచుతున్నారు,బహుశా ఈ ఒత్తిడి తట్టుకోలేక,తల్లిదండ్రులకుచెప్పుకోలేకనేమో



మాధకద్రవ్యాలకు అలవాటుపడి విచక్షణ కోల్పోతున్నారు.....తాజాగా ఖమ్మం నగరంలో కలెక్టరెట్ కు కూతవేటు దూరంలో ఉన్న ఓ కార్పొరేట్ కాలేజీలో దారుణం చోటు చేసుకుంది,మద్యం, డ్రగ్స్ మత్తులో తోటి విద్యార్థిపై విచక్షణా రహితంగా దాడి చేసి గాయపరిచిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది,గత మూడు రోజుల క్రితం డ్రగ్స్ తీసుకున్న కొందరు ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు విచక్షణ కోల్పోయి ఒక విద్యార్థిపై దాడి చేసి గాయపరిచారు,కండ్ల ముందు జరుగుతున్న దారుణాన్ని అడ్డుకోబోయిన విద్యార్థులపై కూడా దాడి చేశారు,దీంతో దాడిలో గాయపడిన విద్యార్థి గత మూడు రోజులుగా ఓ ప్రయివేటు హాస్పిటల్లో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది,ఇక్కడ ప్రధానమైన అంశం ఏమిటంటే దాడీ జరుగుతున్న సమయంలో కళాశాల హాస్టల్ కు సంబందించిన వార్డెన్,సెక్యూరిటీ సిబ్బంది అందుబాటులో లేకపోవడం పలు అనుమానాలకు దారితీస్తుంది .జరిగిన దాడిని రహస్యంగా వీడియో తీసిన మరో విద్యార్థితన తల్లిదండ్రులకు పంపించ డంతో విషయం వెలుగులోకి వచ్చింది,మరుసటి రోజు ఘటన గురించి తల్లిదండ్రులు యాజమా న్యాన్ని ప్రశ్నించడంతో ఇలాంటివి కాలేజీలో సాధాం ణంగా జరుగుతూనే ఉంటాయాని నారాయణ కళాశాల యాజమాన్యం విషయాన్నీ లైట్ తీసుకుని కొట్టిపడేసిందని విద్యార్థి తల్లిదండ్రులు వాపోతున్నారు,అంతే కాకుండా కొట్టుకున్న విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి ఏదైనా ఉంటే మీరు మీరు బయట చూసుకోండి, మా కళాశాలకు పూయకండి అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడటంతోపాటు,దెబ్బలు తిన్న విద్యార్థి తల్లిదండ్రులను కూర్చోబెట్టి ఈ విషయం బయటకు పొక్కితే ఈ నెల 26 న జరగబోయే చివరి పరీక్షలకు హాల్ టికెట్ ఇవ్వమని కళాశాల యాజమాన్యం బెదిరింపులకు దిగినట్లు విద్యార్థి తల్లిదండ్రులు చెపుతున్నట్లు తెలుస్తుంది.విషయం అనోటా,ఈ నోటపడి బయటకు పొక్కడంతో విద్యార్థి సంఘాల నాయకులు విద్యార్థుల తల్లిదండ్రులు మీడియా ప్రతినిధులు అక్కడికి చేరుకున్నారు.ఇప్పటికైనా కాలేజీలో జరిగిన అమానుష సంఘటనను, జిల్లా కలెక్టర్ స్పందించి, సమగ్ర పోలీసు విచారణ జరిపించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


## సత్తుపల్లి మున్సిపాలిటీ చైర్మన్‌గా ఎండి రెహానా బేగం కమల్ పాషా, వైస్ చైర్మన్ గా బొంతు సుమలత వేణు ప్రమాణస్వీకారం

**– అధికారికంగా ప్రమాణ స్వీకారం చేయించిన ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్.**



**సత్తుపల్లి మేజర్ సూర్య న్యూస్:** శుక్రవారం నాడు సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి ఆధ్వర్యంలో సత్తుపల్లి మున్సిపాలిటీలో విజయం సాధించి మున్సిపాలిటీ చైర్మన్ గా ఎండి రెహానా బేగం కమల్ భాష , వైస్ చైర్మన్ గా బొంతు సుమలత వేణు ను అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు . వీరితో పాటు గా మిగతా మున్సిపల్ కౌన్సిలర్లు కూడా తమ తమ బాధ్యతను స్వీకరించినారు. ఈ కార్యక్రమంలో కమల్ పాషా, దోమ ఆనంద్,బొంతు వేణు, చల్లగుల్ల నరసింహరావు, గాదె చిన్నారావు, తూదిపాల రాంబాబు ,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**కల్లూరు సూర్య న్యూస్ ఫిబ్రవరి 20**

మున్సిపాలిటీ పరిధిలో గల పుల్లయ్య బంజరు గ్రామంలో బుర్రి వారి వివాహ వేడుకల్లో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లెల్ల కృష్ణారెడ్డి గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు షేక్ అఫ్రోజ్ వీరు ఇరువురు వారి వివాహ వేడుకల్లో ముఖ్య అతిథులుగా పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు అనంతరం వారు ఏర్పాటు చేసిన విందును ఆరగించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా క్షేత్రంలోనే పాలన.. కార్యకర్తలే మా బలం!

**– మంత్రి పొంగులేటి ఆశయాలకు అనుగుణంగా ఏదులాపురం అభివృద్ధి**

**– మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత కార్యాలయాన్ని ప్రారంభించిన తుంబూరు దయాకర్ రెడ్డి**

**– అట్టహాసంగా ప్రారంభోత్సవం.. తరలివచ్చిన శ్రేణులు**

**ఏదులాపురం : సూర్య (మేజర్ న్యూస్)**

“అధికారం అంటే గద్దె మీద కూర్చోవడం కాదు.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం క్షేత్రస్థాయిలో శ్రమించడం” అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు సాయి గణేష్ నగర్ (రోడ్డు నంబర్ 8) లో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

**మంత్రి సంకల్పానికి తోడుగా..**

ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ.. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మార్గదర్శకత్వంలో ఏదులాపురం మున్సిపాలిటీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. “ఈ కార్యాలయం కేవలం నాలుగు గోడల మధ్య నడిచేది కాదు.. ఇది ప్రజల కష్టాలను పంచుకునే వేదిక కావాలి. చైర్‌పర్సన్ అనిత ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను





అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలి” అని ఆయన దిశానిర్దేశం చేశారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, వారి సమస్యలను కూడా ఈ కార్యాలయం వేదికగా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

**అభివృద్ధిలో రాజీ పడం..**

మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో గెలిపించిన ప్రజలకు, తనకు అండగా నిలిచిన మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపాలిటీలో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, రోడ్లు, తాగునీటి సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వార్డు కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఆర్ అండ్ బి ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

**సూర్య ప్రతినిధి ఖమ్మం**






ఖమ్మం నగరంలోని టీఎన్జీవో భవన్ నందు తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ ఆఫీసర్ (టీఎన్జీవోస్) యూనియన్ ఆర్ అండ్ బి ఉద్యోగుల ఫోరం 2026 నూతన సంవత్సర టేబుల్ క్యాలెండర్ ను ఖమ్మం జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్ష కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాస్ శుక్రవారం ఆవిష్కరించారు.


ఈ కార్యక్రమంలో టిఎన్జీవోస్ సెంట్రల్ కార్యదర్శి జైపాల్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కే దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు యర్రా. రమేష్, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు లలిత కుమారి, ఫోరం అధ్యక్షులు ఆర్ సూర్యనారాయణ కార్యదర్శి జి నరసింహారావు అసోసియేట్ అధ్యక్షులు, ఎం.డి . ఖాజా మియా, కోశాధికారి వి .ప్రకాష్, సిహెచ్ ఈశ్వర్, శ్రావణ్ కుమార్, ఏ వి ఎల్ నరసింహారావు, పెద్ద బోయిన నాగరాజు, షేక్. మహమూద్,శివ అరుణ్ కుమార్ ,శివకృష్ణ నాయక్, బి .రవీందర్, బి. కిషోర్ చంద్, పి. యుగంధర్, శ్వేత, శ్రీలత, కె.రామకృష్ణ, ఏ ప్రవీణ్ ,షేక్.రబ్బాని, కె.శ్రీను ,భాను, వంశీ ,మురళి ,తదితరులు పాల్గొన్నారు

## మంత్రి పొంగులేటి చొరవ.. కిడ్నీ బాధితుడికి రూ. 9 లక్షల ఎల్వోసీ

**– పొన్నెకల్ గ్రామ శాఖ నాయకుల విన్నపంపై స్పందించిన మంత్రి**

**– తుంబూరు దయాకర్ రెడ్డి సమన్వయంతో త్వరితగతిన సాయం మంజూరు**

ఖమ్మం (సూర్య బ్యూరో):



నియోజకవర్గ ప్రజల కష్టాలను తన కష్టంగా భావించే తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. అత్యవసర వైద్య చికిత్స కోసం ఎదురుచూస్తున్న ఒక నిరుపేదకు ప్రభుత్వ ఎల్వోసీ మంజూరు చేయించి కొండంత భరోసా ఇచ్చారు.

**వివరాల్లోకి వెళ్తే..**

ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్ గ్రామానికి చెందిన కత్రం సిద్దు అనే వ్యక్తి రెండు కిడ్నీలు దెబ్బతిని తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స కోసం సుమారు రూ. 9 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో ఆ నిరుపేద కుటుంబం ఆవేదనలో మునిగిపోయింది. ఈ క్రమంలో పొన్నెకల్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నాయకులు బాధితుడి పరిస్థితిని గమనించి అండగా నిలిచారు.

**పొంగులేటి దృష్టికి తీసుకెళ్లిన దయాకర్ రెడ్డి**

గ్రామ నాయకులు బాధితుడిని తీసుకుని ఖమ్మంలోని మంత్రి క్యాంప్ కార్యాలయ ఇన్-చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి ని కలిశారు. దయాకర్ రెడ్డి బాధితుడి ఆరోగ్య పరిస్థితిని, ఆర్థిక ఇబ్బందులను వెంటనే మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి, ప్రభుత్వపరంగా ఎల్వోసీ మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు.



**త్వరితగతిన 9 లక్షల ఎల్వోసీ మంజూరు**

మంత్రి పొంగులేటి ప్రత్యేక చొరవతో, యుద్ధ ప్రాతిపదికన ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 9 లక్షల ఎల్వోసీ మంజూరైంది. కష్టకాలంలో ప్రభుత్వం నుంచి ఇంత పెద్ద మొత్తంలో సాయం అందేలా చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి బాధితుడు సిద్దు, అతని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ ప్రక్రియను పర్యవేక్షించిన తుంబూరు దయాకర్ రెడ్డికి, వెన్నంటి నిలిచిన పొన్నెకల్ గ్రామ నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు.

# పల్లెల్లో నిధుల పంచాయితీ

**సూర్య ప్రతినిధి ఖమ్మం**





తెలంగాణ రాష్ట్రంలో రెండు నెలల క్రితం కొత్త పంచాయతీ పాలకవర్గాలు కోలువుదీరగా... కొద్దిరోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేశారు. అయితే, ఈ నిధులతో గ్రామపంచాయతీలో కొత్త పంచాయితీ నెలకొంది. దాదాపు రెండేళ్లు పంచాయతీలకు సర్పంచ్‌లు లేకపోవడంతో కేంద్రం నుంచి నిధులు నిలిచిపోయాయి. అత్యవసరపనులకు కార్యదర్శులే సొంతంగా ఖర్చు చేశారు. అంతే కాక గత పాలకవర్గాలు చేసిన అభివృద్ధి పనులు చేపించిన అప్పటి సర్పంచ్‌లకు బిల్లులు మంజూరు కావాల్సి ఉంది. ఇంతలోనే కేంద్రం నుంచి నిధులు మంజూ రు కాగా తమ బకాయిలను పంచాయతీ కార్యదర్శు లు తీసుకుంటున్నారు. కానీ పాత సర్పంచ్‌లకు సంబంధించి బిల్లులు ఇచ్చే విషయంలో కొత్త సర్పంచ్ లు కొన్ని చోట్ల కొర్రీలు పెడుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో మధ్యలో కార్యదర్శులు నలిగిపోతున్నారు.ఎక్కువ చోట్లఎన్నికల్లో సహకరించలేదని...పాత సర్పంచ్‌లకు బిల్లులు చెల్లించే విషయంలో కొత్తసర్పంచ్‌లు నిరాకరిస్తుండడం వేనుక పలు కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఎన్నికల వేళ తమకు సహకరించలేదనే భావనతో పాత వారి బిల్లులు తొక్కి పెడుతున్నట్లు సమాచారం. దీంతో గత పాలకవర్గం తీర్మానాలు, అధికారులు ఎం.బీ. రికార్డులు చేసినా, మరికొన్నింటికి చెక్కులు జారీ అయినప్పటికీ నిధులు లేక తిరస్కరించిన బిల్లులు సైతం ఇవ్వడం లేదని తెలుస్తోంది. కేంద్రప్రభుత్వం ఇటీవల విడుదలచేసిన నిధులను 2023-24లో వీధిదీపాల ఏర్పాటు, తాగునీరు, విద్యుత్ బిల్లుల చెల్లింపులు, పారిశుధ్య నిర్వహణ, పైపు లైన్ లీజేజిల మరమ్మతుల పనులకు వెచ్చించాల్సి ఉంది. ఈ పనులకు మాజీ సర్పంచ్‌లు అప్పులు చేసి మరీ వెచ్చించగా ప్రస్తుత సర్పంచ్‌లు అడ్డు తగులుతుండడంతో గొడవలు జరిగే అవకాశం కనిపిస్తోంది. ఇప్ప టికే కొందరు మాజీ సర్పంచ్‌లు ఎంపీడీఓలకు ఫిర్యాదుచేశారు. అంతేకాక కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందు కు ఇంకొందరు సిద్ధమవుతున్నట్లు సమాచారం.పంచాయతీ నిధులగొడవ పెద్దదిగా మారకముందే అధికారులు కొత్తసర్పంచ్‌లకు తగిన ఆదేశాలు జారీ చేయాలని పలువురు కోరుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందిస్తూ 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులకు గాను బిల్లులు మంజూరయ్యాయని పమ ఎలా వినియోగించాలనే దానిమీద త్వరలోస్పష్టత ఇస్తామని వెల్లడించారు. "ఏనిగండ్ల శ్రీనివాస్ రావు సీనియర్ జర్నలిస్ట్"...

# సర్వేయర్ కొరత...

**-భారం పెరిగి బాధ్యతలు సన్నగిల్లుతున్నాయి.**

**-రైతు అర్జీలు నెలలు గడుస్తున్న పరిష్కారం శూన్యం.**

**-ఒకే మండలానికి పోస్టింగ్...**

**-మూడు మండలాల అదనపు బాధ్యతలు... ఫైళ్లు నత్త నడక.**



**అశ్వాపురం, సూర్య (మేజర్ న్యూస్) -**

అశ్వాపురం మండలంలో సర్వేయర్ కొరత కారణంగా రైతులు సమర్పించిన అర్జీలు నెలల తరబడి పెండింగ్‌లోనే ఉన్నాయి. వివాదాస్పదమైన భూసంబంధిత సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నప్పటికీ అదనపు బాధ్యతలు తీసుకున్న సర్వేర్ కి సమయం లేక అనేక అర్జీదారుల సమస్యలు నిలిచిపోయాయి.ఒక మండలానికి మాత్రమే పోస్టింగ్ ఉన్న సర్వేయర్‌కు భద్రాచలం, అశ్వాపురం, మణుగూరు మండలాలతో పాటు ఇతర ప్రత్యేక సర్వే బాధ్యతలు కూడా అప్పగించడంతో పనిభారం గణనీయంగా పెరిగింది. దీంతో రెగ్యులర్ సర్వేలు సకాలంలో జరగక, కొనుగోలు, అమ్మకాలు, పంట పొలాల సరిహద్దుల నిర్ధారణ, ప్రభుత్వ మరియు ఫారెస్ట్ బౌండరీస్ నిర్ధారణ, ప్రభుత్వ బిల్డింగ్స్ సంబంధిత నిర్మాణాలకు కావలసిన భూమి సేకరణ, చేర్పులు,మార్పులు, సర్వే నంబర్ల వివాదాలు వంటి అనేక ఫైళ్లు జాప్యం కొనసాగుతుంది.ఇదిలా ఉండగా, నెల్లిపాక రెవెన్యూ పరిధిలోని మొండికుంట గ్రామంలో ఈరోజు పెండింగ్‌లో ఉన్న ఒక అర్జీదారి సమస్యపై సర్వే నిర్వహించారు. ఈ సర్వేకు స్థానిక రైతుహాజరై తమ అభ్యంతరాలు, వివరాలు వెల్లడించారు. అయితే ఇలాంటి ఒకట్రెండు సర్వేలు నిర్వహించడం ద్వారా మొత్తం సమస్యలు పరిష్కారం కాదని రైతులు అభిప్రాయపడుతున్నారు. పంట రుణాలు, పట్టాదారు పాస్‌బుక్ సవరణలు, భూమి కొనుగోలు అనంతరం రిజిస్ట్రేషన్ వంటి కీలక అవసరాల కోసం సర్వే తప్పనిసరి. కానీ సిబ్బంది కొరత కారణంగా రైతులు ఆర్థికంగా, పరిపాలనా పరంగా నష్టపోతున్నారు. "అర్జీలు పెట్టి నెలలు గడుస్తున్నా స్పందన లేకపోవడం బాధాకరం" అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వేయర్ కొరతతో భారం పెరిగి బాధ్యతలు చల్లగిల్లుతున్నాయని ప్రజలు అంటున్నారు. అశ్వాపురం మండలానికి వెంటనే రెగ్యులర్ సర్వేయర్ పోస్టును భర్తీ చేసి, అదనపు బాధ్యతలను తగ్గించాలని రైతాంగం డిమాండ్ చేస్తోంది. జిల్లా కలెక్టర్ మరియు సంబంధిత రెవెన్యూ ఉన్నతాధికారులు తక్షణ చర్యలు తీసుకుని పెండింగ్ ఫైళ్లను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు. లైసెన్స్ సర్వేలు భార్గవి, సుప్రజ, వీర్రాజు పాల్గొన్నారు.

# పూర్తిస్థాయిలో స్త్రీనిధి బకాయిలు చెల్లించాలి

**– డిఆర్డిఓ కొండపల్లి శ్రీరామ్**

**పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్.....**





శ్రీ నిధిలో రుణాలు పొందిన వారు పూర్తి స్థాయిలో బకాయిలు చెల్లించాలని జాప్యం చేస్తే మీకే నష్టమని చెల్లింపుల చేయనిచో కఠినమైన చర్యలు తీసుకుంటామని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కొండపల్లి శ్రీరామ్ హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఇంటి బిల్లు లతో కూలీల చెల్లింపులు విషయం లో జాప్యం చేయొద్దని ఆయన సూచించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఆర్ డబ్లు ఎస్, ఉపాధి హామీ పథకం, ఐకేపీ సిబ్బంది అధికారులు, పంచాయతీ కార్యదర్శి లతో ఆయన సమీక్ష నిర్వహించారు. మండలం లోని 33 పంచాయతీ లలో నర్సరీ లు ఏర్పాటు చేయాలనీ ప్రతి నర్సరిలో మూడు వేల మొక్కలు నర్సరీల్లో పెంచాలని అన్నారు ఉపాధి హామీ పథకం లో కూలీలకు చెల్లెంపులు మర్చి నెల చివరి నాటికీ చెల్లింపులు జరపాలని అన్నారు.వేసవి కాలం మొదలు అయ్యిందని త్రాగునీటి విషయం లో నిర్లక్ష్యం వహించవద్దని అన్నారు ఈ సమీక్ష లో ఏపిడి చలపతి రావు. ఎంపీడీఓ అన్నపూర్ణ, ఉపాధి హామీ ఏపిఓ మధుసూదన్ పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

**-విద్యార్థులకు అవగాహన కల్పించిన సి ఐ నాగబాబు**

**మణుగూరు ఆర్ సి,సూర్య (మేజర్ న్యూస్)-**



సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు శుక్రవారం సైబర్ నేరాలపై మణుగూరు సి ఐ పాటి నాగబాబు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు, సిబ్బందికి వివిధ రకాల ఆర్థిక మోసాల గురించి వివరించారు. లోన్ యాప్ ల మోసాల గురించి,పి ఓ ఎస్ యంత్రాల వద్ద మోసాలు,స్టాక్ మార్కెట్ పెట్టుబడి మోసాలు,ఏ పి కె డౌన్‌లోడ్ మోసాలు మొదలైన వాటి గురించి వివరించారు.ఈ విధంగా జరిగే మోసాల విధానాలు వాటిని ఎలా ఫిర్యాదు చేయాలి, ఎలా నివారించాలి మరియు తీసుకోవాల్సిన ఇతర జాగ్రత్తల గురించి సమగ్రంగా వివరించారు. ఆర్థిక మోసాలలో పెద్దవారు ఎక్కువగా లక్ష్యంగా మారుతున్నందున, సైబర్ నేరాలపై అవగాహన సందేశాన్ని స్పష్టంగా చేరవేయడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామన్నారు.

# ఈనెల 21 నుండి శ్రీ మోక్ష వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు

**పాల్వంచ,సూర్య (మేజర్ న్యూస్)-**



పట్టణ పరిధిలోని గుడిపాడు లో నూతనంగా పెయింట్ చేసుకున్న శ్రీ మోక్షం వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట ఈనెల 26వ తేదీ ఘనంగా జరగనుందని నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం పాల్వంచ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆలయ నిర్మాతలు ఎం సురేష్ రెడ్డి, రామిరెడ్డి, ఆలయ ధర్మకర్త ప్రశాంత్ మాట్లాడుతూ ఎంతో పురాతనమైన వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని శిథిలావస్థలో ఉండగా ఎన్నారై సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయాన్ని నూతనంగా నిర్మించి ప్రారంభానికి ఉత్సవాలు నిర్వహిస్తున్న ట్లుగా తెలిపారు. భక్తులంతా ఆలయ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో రామిరెడ్డి, డాక్టర్ యుగంధర్ రెడ్డి, రామ కృష్ణారెడ్డి ,వెంకట్రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాన్పు చేసి మూగ జీవాలను కాపాడిన 1962 సిబ్బంది

**పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్....**





108 వాహనాలు మనుషుల ప్రాణాలు కాపాడుతుంటే మూగ జీవాలను సైతం ఆపదలో ప్రాణాలను కాపాడుతున్నాయి 1962 సంచార పశు వైద్య వాహనాలు. ఈ క్రమంలో శుక్రవారం మూగ జీవానికి క్లిష్టతరమైన కాన్పు చేసి ప్రాణాన్ని కాపాడారు సత్తుపల్లి1962 సంచార వాహన సిబ్బంది. పెనుబల్లి మండలం లింగగూడెం గ్రామంలో కంచపు చిన్న వెంకన్న అనే రైతుకు చెందిన మేకకు కాన్పు సమస్య డిస్టోకియా ఏర్పడింది. మేక ఈనే సమయంలో కాన్పు కాక ఇబ్బంది పడుతుంటే మేక యజమాని 1962 వాహనానికి సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న 1962 వాహన సిబ్బంది వైద్యుడు షేక్ సుభాని, కెప్టెన్ వేమూరి మహాకవి, హుటాహుటిన లింగగూడెం చేరుకుని ఆ మూగ జీవానికి వచ్చిన సమస్యను గుర్తించి వైద్యం చేసి క్షేమంగా మేకకు కాన్పు చేశారు. మూడు పిల్లలకు జన్మించగా ఒక మేక పిల్ల కడుపులోనే చనిపోయింది. తల్లి మేక, రెండు మేక పిల్లలు క్షేమంగా ఉన్నాయని ఒకే కడుపులో మూడు పిల్లలు పుట్టడం అరుదని పశు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా లింగగూడెం గ్రామస్తులు, మేక యజమాని 1962 సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. 1962 జిల్లా మేనేజర్ ఐలూరి దుర్గాప్రసాద్, గ్రామ్ మేనేజర్ షేక్ నజురుద్దీన్ సిబ్బందిని అభినందించారు.

# సామాజిక న్యాయం కారాదు అందని ద్రాక్ష

**– 'విజ్ఞాన్'లో ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం**




ఇల్లందుఆర్‌సి, సూర్య (మేజర్ న్యూస్)– ప్రపంచవ్యాప్తంగా మానవ హక్కులు యథేచ్ఛగా ఉల్లంఘన కు లోనవుచున్న నేపథ్యంలో నేడు మనం 'ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం' జరుపుకుంటున్నామని ప్రముఖ మానవ ప్రవర్తనా శాస్త్ర నిపుణులు డా. కుసుమ రమేష్ పేర్కొన్నారు. ఇల్లందులోని 13వ నెంబర్ బస్తీలోగల 'విజ్ఞాన్ ' విద్యాసంస్థలో శుక్రవారం నిర్వహించిన సెమినార్ లో ప్రత్యేక ఆహ్వానితుడిగా హాజరైన ఆయన ప్రారంభ ఉపన్యాసంలో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ తీర్మానాన్ని అనుసరించి 2009 నుండి ప్రతీ ఫిబ్రవరి 20ను ఆయా దేశాలు సమాజంలో నెలకొన్న వైరుధ్యాలను రూపుమాపి తమ పౌరులందరికీ సమన్యాయం అందేవీలుగా వివిధ కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని పేర్కొన్నారు.ఆధునిక జీవన విధానానికి ఆటంకంగా నిలిచిన పేదరికం, నిరక్షరాస్యత, అణచివేత, జాతి.. కుల..మత..వర్గ.. లింగ వివక్షణ, ఆర్థిక..రాజకీయ.. సామాజిక అసమానతలు తొలగించి గౌరవ ప్రదమైన జీవితానికి భరోసా కల్గించే ' నిబద్ధతతో కూడిన సామాజిక అభివృద్ధి 'అనే 2026వ సంవత్సరపు నినాదాన్ని అందిపుచ్చుకుని ఆదర్శవంతమగు సంఘాన్ని తీర్చిదిద్దే సుస్థితి కల్పించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కివక్కాణించారు. భారతదేశం లోని పరిస్థితులను విశ్లేషిస్తూ విద్యాసంస్థ కరెస్పాండెంట్ జివి.నర్సయ్య కేంద్ర ప్రభుత్వ 'సామాజిక న్యాయ సాధికారితా శాఖ 'వివిధ వర్గాల వారికి విద్యా ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు, ప్రోత్సహకాలు, ప్రత్యేక విద్యాలయాలు, విదేశీ విద్యకు ఆర్థిక సాయం, ఆరోగ్య రక్షణా మొదలైన పథకాలు అమలు చేస్తుండగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రకాల పెన్షన్లు, ఉపాధిహామీ, సబ్సిడీ రుణాలు, ఋణమాఫీ, ఉచిత విద్యుత్, ప్రజాపంపిణీ వ్యవస్థ, ఎన్నికల హామీలమేరకు ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్న తీరును వివరిస్తూ ఇంకనూ సమాజంలో వేళ్ళూనుకున్నకున్న వివక్ష, కులతత్వం, ఆర్థిక అసమానతలు, అధికారిక అలసత్వం, సుదీర్ఘ న్యాయ ప్రక్రియ, అంతులేని అవినీతి, పాలనా వైఫల్యాలు, నిరక్షరాస్యత, ప్రాంతీయ దురభిమానాలు లక్ష్య సాధన దిశలో అవరోధాలుగా నిలుస్తున్నాయని వివరించారు.ఈ అడ్డంకులు అధిగమించి, నాణ్యమైన విద్య, సంపూర్ణ ఆరోగ్యరక్షణ, సశాస్త్రీయ పాలనా విధానాలు, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, ఉపాధికల్పనా అవకాశాలు, సామాజికన్యాయ ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం తదితర అంశాల్లో దృష్టి సారించాలని వక్తలు పేర్కొంటూ సామాజిక న్యాయసాధన ఒక నిరంతర ప్రక్రియ అని, ఇది కేవలం ఒక అందని ద్రాక్షగా మిగిలిపోకుండా రాబోయే తరాలకు సామాజిక భద్రత కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## గ్రంధాలయ భవన నిర్మాణానికి త్వరలో నిధులు మంజూరు . ఐటిడిఎ.పిఓ.



టేకులపల్లి సూర్య (మేజర్‌న్యూస్)– మండల కేంద్రమైన టేకులపల్లిలోని గ్రంథాలయ భవననిర్మాణానికి నిధులు త్వరలో మంజూరు చేస్తామని భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి. బి.రాహుల్ తెలిపారు.శుక్రవారం టేకులపల్లి శాఖ గ్రంథాలయమును సందర్శించి, అనంతరము మాట్లాడారు.టేకులపల్లి గ్రంథాలయ భవనం కట్టిస్తామని, గ్రంథాలయంను ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి. వీరబాబు, పాలకుడు ఆర్. నాగన్న , ఆఫీస్ ఇంచార్జ్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ సమస్యలపై నేరుగా ఫిర్యాదు చేయండి

**– సర్పంచ్ బాదావత్ శ్రీకాంత్**

**–ఎన్ కె నగర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామసభ**

చుంచుపల్లి, సూర్య (మేజర్ న్యూస్) – మండలపరిధిలోని ఎన్ కె నగర్ బాదావత్ తండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బాదావత్ శ్రీకాంత్ అధ్యక్షతన శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి వాటి పరిష్కార దిశగా ముందుకు సాగుతామని తెలిపారు. ముఖ్యంగా ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించటం తో పాటు పారిశుద్ధ్య పనులతో పాటు డ్రైనేజ్ వ్యవస్థను మెరుగుపరిచి, ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా కృషి చేస్తానని తెలిపారు. అదేవిధంగా ఎన్ కె నగర్ గ్రామపంచాయతీ గ్రూపులో ప్రజల సమస్యలు తెలియజేసిన వెంటనే, స్పందించి అట్టి సమస్యపై వెంటనే ఆ సమస్యను పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఏ సమస్య ఉన్న గ్రూప్ ద్వారా గానీ, నేరుగా ఎన్ కె నగర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నేరుగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సమస్యపై వెంటనే తాము ఆ సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమములో పంచాయతీ కార్యదర్శి ఏ ఇందిరా, ఉప సర్పంచ్ మాలోత్ లక్ష్మి ,పాలకవర్గ సభ్యులు ,కల్లూరి లక్ష్మీ ,ఇస్లావత్ రాధ, గ్రామ స్థాయి అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ విధానము అమలు చేయాలి



టేకులపల్లి సూర్య (మేజర్ న్యూస్)– 2004 నుండి అమలులో ఉన్న సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని టిఎస్ సిపిఎస్ ఈయు ఉద్యోగ ,ఉపాధ్యాయ టేకులపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సిపిఎస్ విధానం రద్దు చేయాలని,డిఎ బకాయిలు ఏక మొత్తంగా చెల్లించాలని, ఇహెచ్ఎస్ విధానం లో, సిపిఎస్ఉద్యోగుల వాటా పై స్పష్టత కావాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నిక సమయంలో కాంగ్రెస్ పార్టీ ఉద్యోగులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. సిపి ఎస్ ను రద్దు చేస్తామని, వరంగల్ సభలో ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , తొందరగా సిపిఎస్ ను రద్దు చేయకపోతే, భవిష్యత్ లో పెద్ద ఎత్తున ఉద్యమం చేయవలసి ఉంటుందన్నారు. ఈ సమావేశం లో రమణ, నాగునాయక్, హాతీరామ్, జైల్సింగ్ ,బాలాజీ, రమేష్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన నాగా సీతారాములు

కొత్తగూడెం, సూర్య (మేజర్ న్యూస్)– కొత్తగూడెం క్లబ్‌లో వల్లాల సతీష్,లిఖిత దంపతుల కుమార్తె రక్షిత, సంతోష్ వివాహ వేడుకకు టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం జూలూరుపాడు మండలపరిధిలోని నర్సాపురం గ్రామంలో జరిగిన తెల్లబోయిన.నాగేశ్వరరావు–లక్ష్మి దంపతుల కుమారుడు వేణు,నందిని వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.



## అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలి

**–ఐ.టి.డి.ఏ పి ఓ బి.రాహుల్**

చుంచుపల్లి,సూర్య(మేజర్ న్యూస్)– ఇటీవల ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన ఫెడరేషన్ కప్ రెజ్లింగ్ పోటీలలో, ఢిల్లీలో జరిగిన కేలో ఇండియా ట్రైబల్ సెకండ్ ఫేస్ రెజ్లింగ్ పోటీలలో ఏ.వెంకటప్రసాద్ 97 కేజీల విభాగములో కె. నవీన్ 100 కేజీల విభాగంలో పాల్గొని అంతర్జాతీయ క్రీడాకారులతో తరబడి సత్తా చాటి బెస్ట్ ర్యాంకులో నిలిచి కేలో ఇండియా జాతీయ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా కొత్తగూడెం విచ్చేసిన ఐ.టీ.డీ.ఏ పీవో బి రాహుల్ ను, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి కాశీ హుస్సేన్ ఆధ్వర్యంలో క్రీడాకారుల తో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. రెజ్లింగ్ పోటీలలో సత్తా చాటి, కేలో ఇండియా ట్రైబల్స్ రెజ్లింగ్ జాతి స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ముందుగా అభినందించారు.ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో బి రాహుల్ మాట్లాడుతూ జాతీయస్థాయి పోటీలలో సైతం పతకాలు గెలుపొంది అంతర్జాతీయ పోటీలలో సైతం ప్రతిభ కనబరిచి జిల్లా ఖ్యాతిని చాటాలని యువతి యువకులు చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తి కనబరచాలని ప్రతిభవంతులైన క్రీడాకారులకు ప్రోత్సాహాన్ని అందిస్తామని ఆయన సూచించారు జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, కోచ్ పి.కాశీ హుస్సేన్ వద్ద శిక్షణ పొందుతున్న ఏ.వెంకట ప్రసాద్ కె.నవీన్ లు గతంలో కూడా పలు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో పతకాలు బహుమతులను గెలుపొందారు. ఈ కార్యక్రమంలో టి.పి.సి.సి ప్రధాన కార్యదర్శి జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు నాగ సీతారాములు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు జిల్లారెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.కాశీ హుస్సేన్ జిల్లా టైక్వాండో అసోసియేషన్ ప్రతినిధి ఇ.మొగిలి, సుదర్శన్ క్రీడాకారులు పాల్గొన్నారు.



# సింగరేణి ఏరియా లో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ అవగాహన సదస్సు




కొత్తగూడెం సింగరేణి,సూర్య (మేజర్ న్యూస్)–ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ సందర్భంగా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం షాలేం రాజు గ ఆదేశానుసారం జనరల్ మేనేజర్ కార్యాలయంలో శుక్రవారం కాన్ఫరెన్స్ నందు జనరల్ మేనేజర్ కార్యాలయ అధికారులకు, ఉద్యోగులకు మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో క్యాన్సర్ పై అవగాహన సదస్సును నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మెయిన్ హాస్పిటల్ హెల్త్ ఆఫీసర్ డా॥ డి. లలిత కుమారి మాట్లాడుతూ ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 4న ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం ను నిర్వహిస్తారు. ఈ దినోత్సవాన్ని యూనియన్ ఫోర్ ఇంటర్నేషనల్ కాన్సర్ కంట్రోల్ (యు ఐసీసీ) ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది. ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం క్యాన్సర్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, ముందస్తు నిర్ధారణ సమయానుకూల చికిత్స ప్రాముఖ్యతను తెలియజేయడం జరిగింది. అలాగే క్యాన్సర్ బాధితులకు మానసిక, సామాజిక మద్దతు కల్పించడం అని అన్నారు. క్యాన్సర్ -- ఒక ప్రపంచ సమస్య అని ప్రపంచవ్యాప్తంగా ప్రతి




సంవత్సరం లక్షలాది మంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. ఊపిరితిత్తుల క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, నోటి క్యాన్సర్ వంటి అనేక రకాల క్యాన్సర్లు విస్తరిస్తున్నాయి. జీవనశైలిలో మార్పులు, పొగాకు వినియోగం, మద్యపానం, అసమతుల్య ఆహారం, వ్యాయామం లోపం కాలుష్యం వంటి కారణాలు క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతున్నాయని నివారణ ముందస్తు నిర్ధారణ క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స విజయవంతమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం, పొగాకు వినియోగాన్ని పూర్తిగా మానేయడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, రోజువారీ వ్యాయామం చేయడం ద్వారా క్యాన్సర్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. మహిళలు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం అత్యంత అవసరమని అన్నారు. "క్యాన్సర్‌పై అవగాహన -- జీవన రక్షణకు మొదటి అడుగు" అనే సందేశంతో, మనమందరం కలిసి క్యాన్సర్‌ను ఎదుర్కొని, బాధితులకు మద్దతుగా నిలుద్దామని డాక్టర్ పేర్కొన్నారు. సమయానికి నిర్ధారణ, సరైన చికిత్స, ధైర్యం ఉంటే క్యాన్సర్‌ను జయించవచ్చని అన్నారు. అనంతరం డాక్టర్ జీఎం కార్యాలయంలోని అధికారులు, ఉద్యోగస్తులు క్యాన్సర్ పై అడిగిన సందేహాలను నివృత్తి పరచడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం జి.వి. కోటి రెడ్డి తో పాటు ఏరియా ఇంజనీర్ కే సూర్యనారాయణ రాజు, ఎజిఎం (ఫైనాన్స్) ఈ. భీభాత్స, ఎజిఎం (పర్సనల్) జీవి. మోహన్ రావు, రుద్రంపూర్ డిస్పెన్సరీ మెడికల్ సూపర్డెంట్ ఏం పరశురాములు, మెయిన్ హాస్పిటల్ హెల్త్ డాక్టర్ డి లలిత కుమారి,జనరల్ మేనేజర్ కార్యాలయంలోని వివిధ విభాగాల అధిపతులు, అధికారులు, ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం ఏరియాలో పర్యటించిన డైరెక్టర్(ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్)



కొత్తగూడెం సింగరేణి,సూర్య (మేజర్ న్యూస్) – కొత్తగూడెం ఏరియాలో సింగరేణి సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) కొప్పుల వెంకటేశ్వర్లు శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా వెంకటేష్ ఖని కోల్ మైన్స్ లో జరుతున్న మట్టి తొలగింపు పనులను సమీక్షించారు. అనంతరం ఆయన వికే సిఎంలోని బొగ్గు ఉత్పత్తి కి సంబందించిన సర్వే మ్యాప్ లను సంబంధిత అధికారులతో పరిశీలించి మట్టి తొలగింపు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత సింగరేణి అధికారులకు, కాంట్రాక్టర్ ను ఆదేశించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రోజు వారి బొగ్గు ఉత్పత్తి,రవాణా, ఓబి బ్లాస్టింగ్, లోడింగ్ పనులను వికే సిఎం ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎంవీ నరసింహారావు ని అడిగి తెలుసుకున్నారు. తరువాత డైరెక్టర్ మాట్లాడుతూ నూతనంగా అనుమతులు వచ్చిన వికేఓసిబొగ్గు ఉత్పత్తి ప్రారంభ పనులను ఆలస్యం చేయకూడదని, ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో పూర్తి చేయాలని అలాగే అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. బొగ్గు ఉత్పత్తి, రవాణా రోజు వారి లక్ష్యాలను అధికమించి రవాణాకు ఎటువంటి ఆటంకములు కలుగకుండా ముందస్తు జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. అలాగే బొగ్గు నాణ్యత సామర్థ్యం పెంచేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచనలను సలహాలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ తో పాటు జిఎం ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ దేవేందర్, కొత్తగూడెం ఏరియా ఎస్ ఓ టు జిఎం జి వి కోటి రెడ్డి, వికే సిఎం ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎంవి నరసింహారావు, మేనేజర్ రామచంద్ర మురళీ సెక్యూరిటీ అధికారి యూ. అభిలాష్ ఇతర సంబంధిత అధికారులు, సర్వే సిబ్బంది సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.



# సెక్యూరిటీ సిబ్బందికి ట్రాఫిక్ కంట్రోల్ శిక్షణా తరగతుల ముగింపు



కొత్తగూడెం సింగరేణి,సూర్య (మేజర్ న్యూస్)–సింగరేణి వ్యాప్తముగాఉన్న ఎస్అండ్ పిసి సెక్యూరిటీ గార్డులకు విడతల వారీగా నిర్వహించే ట్రాఫిక్ కంట్రోల్ శిక్షణా తరగతుల లో భాగముగా ఈనెల 17 నుండి నాలుగు రోజుల పాటు కొత్తగూడెం ఎస్అండ్ పిసి ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన 54వ ట్రాఫిక్ కంట్రోల్ శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏరియా సెక్యూరిటీ అధికారి, ట్రైనింగ్ అధికారి యం.డి. జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు. ఈ సంధర్భముగా ఏరియా సెక్యూరిటీ అధికారి, ట్రైనింగ్ అధికారి యం.డి. జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ సెక్యూరిటీ సిబ్బంది అందరికీ క్రమశిక్షణ అనేది ముఖ్యం అని పేర్కొన్నారు. మనం క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తున్నపుడే మనకు గుర్తింపు వస్తుందని, ట్రాఫిక్ కంట్రోల్ శిక్షణ సెక్యూరిటీ సిబ్బంది అందరికీ అవసరం అని వివరించారు. ఈ శిక్షణ వలన డ్యూటీ జీవితం లోనే కాకుండా, వ్యక్తిగతంగా కూడా ఉపయోగకరమైనదని తెలిపారు. ఈ నాలుగు రోజుల శిక్షణా కాలంలో ట్రాఫిక్ రెగ్యులేటరీ చట్టం, మాండేటరీ, కాషనరీ, ఇన్ఫర్మేటరీ సిగ్నల్స్, ట్రాఫిక్ పాయింట్ మన్ డ్యూటీస్, క్రౌడ్ కంట్రోల్ వంటి అంశాలపై అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీచే పూర్తి అవగాహన కలిగించడం జరిగినదని తెలిపారు. ఈ శిక్షణ వలన ఎటువంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా, మెయిన్ గేటు వద్ద, చెక్ పోస్ట్ ల వద్ద రద్దీ లేకుండా సాఫీగా అందరు తమ విధులను సక్రమంగా నిర్వహించేందుకు దోహదం చేస్తుంది అని పేర్కొన్నారు. యస్అండ్ పిసి విభాగము పటిష్టంగా ఉండేందుకు కావలసిన అన్ని రకాల చర్యలు, యస్అండ్ పిసి ట్రైనింగ్ సెంటర్ అభివృద్ధికి అన్ని రకాల సహాయ సహకారాలు యాజమాన్యం అందిస్తుంది అని తెలిపారు. కావున సెక్యూరిటీ సిబ్బంది అందరు మెరుగైన వృత్తి నైపుణ్యంతో, అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ, సింగరేణి ఆస్తులు, స్థలాలను పరిరక్షించాలని, సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలి అని తెలిపారు. అనంతరం ఉత్తమ ట్రైనీలుగా ఎంపిక అయిన కె .శ్రీనివాసరావు, బి. శ్రీనివాస్ కు బహుమతి ప్రదానం గావించారు. శ్రీ జ్యోతి అనాథ వృద్ధుల శరణాలయ నిర్వాహకులకు నిత్యవసరాలను వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో డి. నారాయణరెడ్డి, ట్రైనింగ్ ఇన్ స్పెక్టర్, ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎల్లిన రాఘవరావును పరామర్శించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు..

దమ్మపేట, సూర్య (మేజర్ న్యూస్ ) – నాచారం గ్రామానికి చెందిన మాజీ సొసైటీ అధ్యక్షుడు ఎల్లిన రాఘవరావు ఇటీవల అనారోగ్య కారణంగా హైదరాబాదులోని ఒక ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతుండగా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం ప్రైవేట్ హాస్పిటల్ లో ఉన్న వెల్లిన రాఘవరావు వద్దకు చేరుకుని పరామర్శించారు. ఈ క్రమంలోనే ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. తుమ్మల ముఖ్య అనుచరుడైన ఎల్లిన రాఘవరావు గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని మంత్రి తుమ్మల ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో మంత్రి తుమ్మల తో పాటు రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు సాదు రమేష్ రెడ్డి ఉన్నారు.



# పార్టీ విస్తరణ, ప్రజా పోరాటాలే లక్ష్యం

**-అధర్మ యుద్ధంలో ధర్మంగా గెలిచాం**

**-కౌన్సిలర్ల అభినందన సభలో సిపిఐ నేత కూనంనేని**




**ఖమ్మం సూర్య టౌన్ న్యూస్**

పార్టీ విస్తరణ, ప్రజా ఉద్యమ నిర్మాణమే లక్ష్యంగా పనిచేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పలు చోట్ల అధర్మ యుద్ధం జరిగిందని సిపిఐని ఒంటరిని చేసి ఓడించేందుకు ప్రయత్నాలు జరిగాయని ఆధర్మ యుద్ధంలోనూ ధర్మంగా గెలిచామని ఆయన తెలిపారు. సిపిఐ పక్షాన ఏదులాపురం, వైరా మున్సిపాలిటీలలో గెలుపొందిన కౌన్సిలర్ల అభినందన సభ శుక్రవారం సిపిఐ కార్యాలయంలో జరిగింది. దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నికలు ఒక బాగమని ఇటీవల జరిగిన పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పొత్తు ధర్మాన్ని పాటించలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 41 చోట్ల మున్సిపల్, కార్పోరేషన్లలో విజయం సాధిస్తే అందులో 30 స్థానాల్లో సిపిఐ ఒంటరిగానే పోటీ చేసి గెలిచిందన్నారు. ఐదు చోట్ల కాంగ్రెస్ మద్దతు, ఆరు చోట్ల బిఆర్ఎస్ మద్దతుతో పోటీ చేసి విజయం సాధించడం జరిగిందన్నారు. ఎన్నికల్లో గెలుపు ప్రజలు హర్షించేవిధంగా ఉండాలి తప్ప ఏదో ఒకవిధంగా గెలవాలన్న ఆలోచన ప్రమాదకరమైందని అది ప్రజామోదం పొందదని కూనంనేని తెలిపారు. అధికార యంత్రాంగం సైతం ప్రజాస్వామ్య పద్దతులను పరిరక్షించేందుకు కృషి చేయాలని అధికారంలో ఉన్న వారు ఏమి చెబితే అది చేయడం ఉద్యోగ ధర్మం కాదని సాంబశివరావు సూచించారు. ఎన్నికల్లో గెలుపోటములు సహాజమే అయినా గెలుపును స్పూర్తిగా తీసుకోవాలని ఓటమి నుంచి విజయం వైపు అడుగులు వేయాలని - ఆయన సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పట్టుదలతో పనిచేసి విజయం దిశగా పార్టీని నడిపించాలని ఆయన కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. ఏదులాపురం మున్సిపాలిటీలో గెలుపొందిన దండి రంగారావు, మామిళ్ల శ్రీనాథ్ రెడ్డి, దండి శ్రీజ, వైరా మున్సిపాలిటీలో గెలుపొందిన నల్లమోతు శైలజను కూనంనేని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, కొండపర్తి గోవిందరావు, బిజి క్లెమెంట్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షల భయంతో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం



**బోనకల్, ఫిబ్రవరి 20**

**సూర్య (మేజర్ న్యూస్):** పరీక్షల భయంతో ఒత్తిడికి లోనైన ఓ ఇంటర్ విద్యార్థినీ మూడంతస్తుల గురుకుల భవనం పై నుంచి కిందకు దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం బోనకల్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ముదిగొండ మండలం మాదాపురం గ్రామానికి చెందిన తుడుం మహేశ్వరి కుమార్తె సమీర బోనకల్ లోని గురుకుల పాఠశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీ చదువుతుంది. ఈ నెల 25వ తేది నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానుండటంతో విద్యార్థినీలో ఆందోళన నెలకొంది. పరీక్షా కేంద్రాలలో సీసీ కెమేరాల ఏర్పాటు చేస్తున్నారన్న సమాచారంతో పాటు పరీక్షలు సక్రమంగా రాయలేనన్న భావనతో మానసిక ఒత్తిడికి లోనైనట్లు సమాచారం. తాను గురువారం రాత్రి నుండి తలనొప్పితో బాధపడుతున్నట్లు తమతో చెప్పిందని తోటి విద్యార్థులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఉదయం తరగతి గదిలో నుంచి బయటకు వచ్చిన సమీరా గురుకుల భవనం పైకి వెళ్లింది. అక్కడ నుంచి పాఠశాల భవనం బయట వైపు కిందకు దూకింది. ఇది గమనించిన కొందరు ఉపాధ్యాయులకు సమాచారం అందించారు. దీంతో విద్యార్థినిని మొదట స్థానిక పీ హెచ్ సీకి తరలించి అనంతరం 108 వాహనం ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తదుపరి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స కొనసాగిస్తున్నారు. విద్యార్థినికి తీవ్ర గాయాలైనట్లు తెలుస్తోంది.

# మలకపేట యశోదా హాస్పిటల్‌లో అధునాతన వైద్య చికిత్స

**-అనుభవజ్ఞులైన నిపుణులతో అత్యవసర సేవలు అందుబాటులోకి**

**-విలేకరుల సమావశంలో న్యూరో కన్సల్టెంట్ ఫిజిషియన్ డాక్టర్ సూరిశెట్టి భరత్ కుమార్**

**ఖమ్మం సూర్య (మేజర్ న్యూస్)**




మలక్ పేట్ యశోదా ఆసుపత్రిలో అత్యాధునిక టెక్నాలజీ తో చికిత్స అందిస్తున్నట్లు కన్సల్టెంట్ న్యూరో ఫిజిషియన్ డాక్టర్ సూరిశెట్టి భరత్ కుమార్ పేర్కొన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరం ప్రాంతానికి చెందిన 33 సంవత్సరాల శ్రీమతి మరముల్ల ప్రియాంక (భర్త) రాంబాబు 12/06/2025 న వాంతులు , విరేచనాలు వంటి లక్షణాలతో కండర బలహీనత వల్ల మలకపేటలో యశోదా హాస్పిటల్ లో చేరారని వెంటనే సమగ్ర రక్తపరీక్షలు , బయోకెమికల్ మూల్యా ంకనం బహుళ విభాగాల వైద్యుల పరిశీలన అనంతరం మొదట బయట హైవికలేమియా గా గుర్తించి అధునాతన చికిత్స కోసం అడ్మిట్ అయ్యారని పేర్కొన్నారు . ఆసుపత్రిలో చేరిన సమయంలో తీవ్రమైన పోటాషియం లోపం శారీరక అస్థిరత గమనించబడి ందని అన్నారు . తీవ్రమైన ఎలక్ట్రోలైట్ అసమతుల్య తలు ఆటోఇ మ్యూన్ సంబంధిత మెటబాలిక్ వ్యాధులు సకాలంలో చికిత్స చేయక పోతే ప్రాణాపాయ స్థితులకు దారితీసే అవకాశం ఉంటు ంది . ముఖ్యంగా హైపోకలోమిక్ పీరియాడిక్ ప్యారాలిసిస్ వంటి వ్యాధులు మూత్రపిండ సమస్యలు ఆటోఇమ్యూన్ రుగ్మతలతో కలిసివస్తే నరాల వ్యవస్థపై తీవ్రమైన ప్రభావం చూపవచ్చనీ ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ముందస్తు గుర్తింపు , హైపోకలేమిక్ పీరియాడిక్ పెరాలిసిస్ మెరుగుదలలో ప్రైమరీ షోన్స్ సింర్డోమ్ , డిస్టల్ రీనల్ ట్యూబ్యులర్ అసిడోసిస్ , సెంట్రల్ ఫొంటైన్ మైలినోలిసిస్ , కొత్తగా ప్రారంభమైన సిక్స్ హైపర్కలేమియా సరిచేయబడిందనీ, రోగిని అత్యంత జాగ్రత్తతో పర్యవేక్షించే విభాగంలో ఉంచి , నియంత్రిత విధానంలో విటాషియం స్థాయిలను సరిచేయడం , ఎలక్ట్రోలైట్ సమతు ల్యతను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ , ఆకస్మిక మార్పులు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. చికిత్సలో భాగంగా తీవ్రమైన హైపోకలేమియా నియంత్రితంగా సరిచేయడం , సీల్స్ నియం తణకు యాంటీ ఎపిలెప్టిక్ మందులు , రీనల్ ట్యూబ్యులర్ ఆసిడోసిస్ కు తగిన చికిత్స ప్రైమరీ షోన్స్ సింర్డోమ్కు ఇమ్యూనోథెరపీ , చికిత్స సమయంలో వచ్చిన హైపర్కలేమియాను వెంటనే గుర్తించి సరిచేయడం , న్యూరాలజీ , నెఫ్రాలజీ , రుమటాలజీ , క్రిటికల్ కేర్ , జనరల్ మెడిసిన్ తదితర విభాగాల వైద్యులు సమన్వయంతో చికిత్స అంది ంచము . క్రమంగా రోగిలో కండర బలం మెరు గుపడి , ఏటాషియం స్థాయిలు స్థిరపడ్డాయన్నారు. హైపోకలేమిక్ పీరియాడిక్ ప్యారాలిసిస్ ప్రాణాపాయ స్థితికి దారితీసి వ్యాధి . తీవ్ర పొటాషియం లోపం వల్ల అకస్మాత్తుగా కండర బలహీనత శ్వాస సమస్యలు రావచ్చు నని ,ముఖ్యంగా ఆటోఇమ్యూన్ మూత్రపిండ సంబంధిత కారణాలను గుర్తి ంచడం అత్యంత కీలకం . సకాలంలో ఎలక్ట్రోలైట్ సరిచేయడం బహుళ విభాగాల సమన్వయం ఈ కేసులో కీలక పాత్ర పోషించాయి అని అన్నారు . ఫలితంగా ఆసుపత్రి చికిత్స సమయంలో రోగి స్థిరంగా కోలు కుని , కండర బలం మెరుగుపడి , ఎలక్ట్రోలైట్ స్థాయిలు సాధారణ స్థాయికి చేరి 18/06/2025న రోగిని స్థిర స్థితిలో డిశ్చార్జ్ చేసి , ఔషధాలు , ఆహార నియమాలు క్రమమైన ఫాలోఅప్ సూచనలు ఇచ్చామన్నారు ఈ కేసు యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మలకపేట లో అందుబాటులో ఉన్న అత్యాధునిక నిర్ధారణ సదుపా యాలు , అనుభవజ్ఞులైన నిపుణులు మరియు 24 గంటల క్రిటికల్ కేర్ సేవల సామర్థ్యాన్ని మరోసారి చాటిచెప్పిందని అన్నారు.

# తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు లు ఆహ్వానం

**-జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖాధికారి మహమ్మద్ ముజాహిద్**

**ఖమ్మం (సూర్య బ్యూరో);**

తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ముస్లిం, బౌద్ధులు, సిక్కులు, పార్శీ జైనుల కోసం రెండు కొత్త స్వయం ఉపాధి పథకాలను ప్రవేశపెట్టారు.

**తెలంగాణ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈ పథకాలకు సంబంధించిన పూర్తి వివరాలు ఇక్కడ ఉన్నాయి:**

1. ఎలక్ట్రిక్ స్కూటర్ పథకం -మైనారిటీ యువతకు రవాణా ఆధారిత ఉపాధి కల్పన కోసం ఈ పథకాన్ని రూపొందించారు.

**యూనిట్ విలువ:** రూ.1,50,000/-,ప్రభుత్వ సబ్సిడీ: రూ.1,20,000/- (80%),అభ్యర్థి వాటా: ?30,000/- (20 శాతం)

**అర్హతలు:వయస్సు:** 21 నుండి 40 సంవత్సరాల మధ్య ఉండాలి శిప్రకటన ప్రకారంరి.

**విద్యార్హత:** 10వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలి.

**ఆదాయ పరిమితి:** గ్రామీణ ప్రాంతాల్లో సంవత్సరానికి రూ.1.50 లక్షల లోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.2.00 లక్షల లోపు ఉండాలి.

**తప్పనిసరి పత్రాలు:** ఆధార్ కార్డ్, ఫుడ్ సెక్యూరిటీ కార్డ్ (రేషన్ కార్డ్), పాన్ కార్డ్ కలిగి ఉండాలి.

**డ్రైవింగ్ నిబంధనలు:** ఆర్.టి. ఏ ద్వారా పొందిన చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి . ఆ లైసెన్స్‌పై ఎటువంటి పెండింగ్ కేసులు ఉండకూడదు.

2. తురక కాశ పథకం :3. వెనుకబడిన తరగతుల ముస్లింల ఆర్థికాభివృద్ధికి ఈ పథకం కింద గ్రాంట్లు అందిస్తారు.

**యూనిట్ విలువ:** రూ.60,000/-విభజన: రూ.10,000 విలువైన టూల్ కిట్లు ం రూ.50,000 ఆర్థిక సహాయం (గ్రాంట్).

**అర్హతలు:**అభ్యర్థి తప్పనిసరిగా తురక కాశ ముస్లిం వర్గానికి చెందిన వారై ఉండాలి.ఆధార్ ఫుడ్ సెక్యూరిటీ కార్డ్ కలిగి ఉండాలి.

**దరఖాస్తు విధానం గడువు:** ఈ పథకాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ఫిబ్రవరి 20,202 నుండి మార్చి 01, 2026 వరకు అందుబాటులో ఉంటాయి.

**వెబ్‌సైట్:** ఆసక్తి గల అభ్యర్థులు ఓ .బి.ఎం.ఎం.ఎస్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి సమాచారం కోసం ఖమ్మం జిల్లాలోని మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయాన్ని, Telangana Minorities Finance Corporation అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు నని తెలిపారు.